క్లుప్తంగా

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం రామ్‌ప్రసాద్

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ త్వరలోనే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.35 వేల జరిమానా

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి ఐదో స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల నుంచి 3 వేలు అపరాధ రుసుము విధించినట్లు ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు. ఎనిమిది మందికి మొత్తం రూ.35 వేల జరిమానా కోర్టు విధించినట్లు చెప్పారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

కేజీహెచ్‌లో రక్తదాన శిబిరం



కేజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

మహారాణిపేట: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేజీహెచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇక్కడి బ్లడ్ బ్యాంక్‌లో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, వైద్య విద్యార్థులు, గైనిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు రక్తదానం చేశారు. ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌తో పాటు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జి పాథాలజిస్ట్, పారా మెడికల్ టీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

• మర్యాదపూర్వక కలయిక



ప్రత్యేక పర్యటనలో భాగంగా విశాఖపట్నం వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, అందజేసి శాలువాతో సత్కరించారు. అక్కడే ఉన్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో చర్చించారు.

– సీతమ్మధార

వేదమాత నమో నమామి

- రేపటి నుంచి గాయత్రీదేవి 25వ పూజా వార్షికోత్సవాలు
- సిద్ధమైన అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరాలయం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ–2 కొండవాలు ప్రాంతంలో వెలసిన అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరాలయం ఆధ్యాత్మికంగా విరాజిల్లుతోంది. ఈ శివాలయంలో కొలువైన వేదమాత గాయత్రీదేవి సేవలో భక్తులు తరిస్తున్నారు. గాయత్రీ అమ్మవారి 25వ పూజా వార్షికోత్సవాలు ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 16 నుంచి 29 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

1982లో సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న వరాహగిరి కాలనీ–2లో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరాలయాన్ని స్థాపించారు. స్థానిక కాలనీ అధ్యక్షుడు ఉరిటి ఉమామహేశ్వరరావు శివాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వగా.. దివంగత కేదారశెట్టి పేర్రాజు, మహాలక్ష్మి దంపతులు కాశీ నుంచి విగ్రహాన్ని రప్పించి, సాధువు చేత ప్రాణ ప్రతిష్ఠ చేయించారు. అప్పట్లో చిన్న శివాలయంగా ప్రారంభమై.. నేడు విశేష ప్రాచుర్యం పొందింది. 1997 నుంచి అంబటిపూడి కుటుంబాన్ని ఇక్కడ అర్చకులుగా నియమించారు. అంబటిపూడి శ్రీనివాసరావు పెద్ద కుమారుడు అంబటిపూడి సుధీర్‌శర్మ నాటి నుంచి సుమారు 25 ఏళ్లుగా ధర్మకర్తల ప్రోత్సాహంతో, వారి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు జరిపిస్తున్నారు. కేదారిశెట్టి కుటుంబ సభ్యురాలు కేదారిశెట్టి ఆదిలక్ష్మి ప్రస్తుతం ఆలయ ధర్మకర్తగా ఉంటూ శివాలయంలో జరిగే ప్రతీ కార్యక్రమంలోనూ తన వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు.

వైభవంగా దేవతామూర్తుల ఉత్సవాలు

1997–98లో శివాలయంలో కొత్తగా నందీశ్వర, గాయత్రీదేవి, సాయిబాబా విగ్రహాలను ఆవిష్కరించి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కార్తీక, మాఘ మాసాల్లో కాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు, శ్రావణ, మార్గశిర మాసాల్లో అన్నపూర్ణదేవికి, జేష్ఠ్య మాసంలో గాయత్రీదేవికి, ఆషాఢ మాసంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



ప్రత్యేక పూజలకు ముస్తాబైన గాయత్రీదేవి

పూజా కార్యక్రమాల వివరాలు..

శివాలయంలో కొలువైన వేదమాత గాయత్రీదేవి 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 16 నుంచి 29 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమ పూజలు, 8.30 గంటలకు పంచామృతాభిషేకాలు, 10 గంటలకు సామూహిక గాయత్రి మంత్ర జప సహిత కుంకుమార్చన, నీరాజన, గాయత్రి హోమం, సాయంత్రం సామూహిక మంత్ర జప సహిత కుంకుమార్చన మొదలగు పూజలు జరుగుతాయి. చివరి రోజు 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నారు.



వరాహగిరి కాలనీ–2లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయం

ప్రతి రోజూ విశేష పూజలు



గాయత్రీదేవి 25వ పూజా వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ప్రతీ రోజు వేద మాతకు పసుపుకొమ్ములు, నాణేలు, అరటిపండ్లు, మారేడుపత్రి, బూరెలు, గాజులు, నల్లపూసలు, కనకాంబరం, మల్లె, చామంతి పువ్వులు, అరిసెలు వంటి ప్రత్యేక వస్తువులతో అర్చన చేస్తాం.

– అంబటిపూడి సుధీర్‌శర్మ, ఆలయ అర్చకుడు

భక్తుల సహకారంతో ఉత్సవాలు



25 ఏళ్లుగా మా కుటుంబం శివాలయానికి ధర్మకర్తలుగా ఉంటూ అభివృద్ధి చేశాం. భక్తుల సహకారం, అర్చకుడు సుధీర్‌శర్మ నేతృత్వంలో ఈ ఏడాది ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. జూన్ 16 నుంచి 29 వరకు గాయత్రీదేవికి విశేష పూజలు నిర్వహిస్తాం.

– కేదారిశెట్టి ఆదిలక్ష్మి, ఆలయ ధర్మకర్త

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాతీయ రహదారి దరి కొలువైన లలితా అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వరాహగిరిశ్రీ లలితమ్మకు పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన, లలిత పారాయణ, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్ర విద్య సమాజ అభివృద్ధికి దోహదం

ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎంవి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విమల విద్యాలయం మూసివేత తగదు

సీతంపేట: ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం హఠాత్తుగా మూసివేయడం తగదని పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో ఖండించారు. 40 ఏళ్లుగా పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న పాఠశాల మూసివేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సుమారు 2,400 మంది విద్యార్థులు చదువుతున్నారని, 20 మంది టీచర్లు, 60 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, నామ మాత్రపు ఫీజు వసూలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే స్కూల్ మూసివేయడం తగదన్నారు. 2024–25 సంవత్సరానికి అడ్మిషన్లు ఇచ్చి, మొదటి టర్మ్ ఫీజులు వసూలు చేసి హఠాత్తుగా మూసివేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, పాఠశాల యథావిధిగా కొనసాగించాలని ఉక్కు యాజమాన్యాన్ని శ్రీరామమూర్తి కోరారు.

విద్యార్థుల్లో వైవిధ్యాన్ని గుర్తించండి

సీతంపేట: సీబీఐ ఐడబ్ల్యూఎన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో 'పోస్టరింగ్ ఇంక్లూసివ్ క్లాస్ రూమ్స్, ఎంబ్రేసింగ్ డైవర్సిటీ' అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వైవిధ్యం భావనతో అధ్యాపకులను విద్యార్థులకు పరిచయం చేయడం, విద్యార్థుల్లో వైవిధ్యాన్ని గుర్తించడం అనే ఉద్దేశంతో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీబీఐ ఐడబ్ల్యూఎన్ రిసోర్స్ పర్సన్ ఉషా పంతుల మాట్లాడుతూ విద్యార్థుల్లో వైవిధ్యం, సమానత్వం అర్థం చేసుకోవాలని, ప్రస్తుత ప్రపంచంలోని భావనలు అర్థం చేసుకుని విద్యార్థులతో కలిసేలా బోధన నడవాలన్నారు.



రిసోర్స్ పర్సన్ ఉషా పంతులకు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

సదస్సులో సుమారు 60 మంది అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఆచార్య జి.టి.నాయుడు, డాక్టర్ వి.రాధాదేవి, ప్రొఫెసర్ వర మానస పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్



సీతంపేటలో మెగా ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో శుక్రవారం సాయంత్రం దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్ నిర్వహించారు. సీతంపేట, బీటీఆర్ కాలనీ, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్‌నగర్ 1, 2, 3, గొల్ల వీధి 1, 2, 3, పాత చేపల బజారు ఏరియా, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని మలేరియా సిబ్బంది కె.శివ సత్యనారాయణ, రాంబాబు స్థానికులకు అవగాహన కల్పించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. రూ.500 రుసుం చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

ఉచిత వైద్య శిబిరం రేపు

సీతంపేట: కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంక్ రజతోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం బ్యాంక్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తదానం చేయాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

సీతమ్మధార: ప్రాణత్యాగం చేసైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహార దీక్ష 1,141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అధికారులు అందజేశారు.

దేవస్థానం పాఠశాలలో సకల సౌకర్యాలు

- దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి
- విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల ఆవరణలోనే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ రాంబాబును ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఈవో సందర్శించారు. 1994, 1995, 2002, 2003 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతోపాటు మాస్టర్ ఈకే స్పిరిచ్యువల్ సేవా సంస్థలు, గొడవర్తి వంశీ అండ్ ఫ్రెండ్స్ వితరణగా అందించిన నోట్ పుస్తకాలను ఈవో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలకు ఎంతో ఘనకీర్తి ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత రావడం చాలా గర్వించదగ్గదన్నారు. ముఖ్యంగా హాస్టల్ ఒకచోట, పాఠశాల మరో చోట ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రహించామన్నారు. త్వరలోనే పాఠశాల క్యాంపస్‌లోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్, ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్యాకర్స్ అండ్ మూవర్స్'లో అక్రమాలకు అడ్డుకట్ట

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ప్యాకర్స్ అండ్ మూవర్స్ ముసుగులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశంగా ది వైజాగ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురేంద్రరావు, కె.సుకేష్ తెలిపారు. 80 ఫీట్ రోడ్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో అసోసియేషన్ ప్రారంభించి, విజయవంతంగా ప్రజలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కొందరు ఎలాంటి అనుభవం లేకున్నా.. ప్యాకర్స్ మూవర్స్ సేవలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని, ఇది తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన సభ్యుల ద్వారా సేవలు పొందాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలనుకునే వారు 99491 24137 నంబర్‌లో సంప్రదించాలని అధ్యక్ష, కార్యదర్శులు కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొడ్డేటి సత్తిబాబు, కోరుబిల్లి ఈశ్వరరావు, కోశాధికారులు సిహెచ్.శ్రీకాంత్, ప్రమోద్‌రెడ్డి, సతీష్, అదనపు కార్యదర్శులు రవీంద్ర నాయర్, ఇల్లా రమేష్, వెంకటరమణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్‌ఎంఎస్–వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21లోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28న జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ యువజన వార్షికోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోటా గాయత్రి వరేణ్య, మాస్టర్ సాయికేశవ్ సబేశన్‌ల బృందం నిర్వహించిన వయోలిన్ కచేరీ శ్రావ్యంగా సాగింది. అనంతరం గాత్ర కచేరీలో ఘట్టి శ్రీవిద్య భక్తి గీతాలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమాన్ని వీఎంఏ కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, కృష్ణారావు, అయ్యంగారి భుజంగరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు సంగీత యువజనోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



కచేరీలో ఘట్టి శ్రీవిద్య బృందం

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేష వస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

అలరించిన కూచిపూడి నృత్యం



నిర్వాహకులతో చిన్నారి నృత్య కళాకారిణులు

సీతమ్మధార: అత్యంత మధుర గానాలతో కూచిపూడి నృత్యం కనువిందు చేసింది. ప్రముఖ నృత్య కళాకారిణి, సిరీ డ్యాన్స్ అకాడమీ స్వర్ణ శిష్య బృందం శుక్రవారం రాత్రి దొండపర్తి రామాలయంలో దుర్గాదేవి జాతర సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారుల నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ఆలయ నిర్వాహకులు నృత్యకళాకారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. అంతకు ముందు ఆలయంలో భక్తులు దుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.